TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 58 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | జూన్ 09, 2026

కాంగోను వణికిస్తున్న
## ఎబోలా వైరస్

- వంద దాటిన మరణాల సంఖ్య
- 550కి పైగా కేసులు నమోదు
- 'బుండిబుగ్యో' రకం వైరస్‌గా గుర్తింపు..
- ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన



2లో..

## బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం








2లో..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పేదల ఆశలను నెరవేరుస్తున్న 'ప్రజా ప్రభుత్వం'
- అశ్వారావుపేటలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్..
- వంద పడకల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ మంజూరు
- నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు
- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన రెవెన్యూ మంత్రి

అశ్వారావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు.

## మహిళలు ఆర్థికంగా ఎదుగుతుంటే బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది

- మంత్రి సీతక్క
- ఫ్రీ బస్సు స్కీమ్ తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు



## ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన బీఆర్ఎస్
- పదేళ్లలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన..
- తడిసిన ధాన్యానికీ మద్దతు ధర
- బీఆర్ఎస్, కేంద్ర ప్రభుత్వాలపై భట్టి నిప్పులు

2లో..



## హెచ్-1బీ వీసాపై ట్రంప్ ప్రభుత్వానికి షాక్

- లక్ష డాలర్ల ఫీజు నిబంధన కొట్టివేత

**వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వానికి అక్కడి ఫెడరల్ న్యాయస్థానం గట్టి షాక్ ఇచ్చింది. విదేశీ ఐటీ నిపుణులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే హెచ్-1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల (సుమారు రూ.85 లక్షలకు పైగా) భారీ ఫీజు నిబంధనను కోర్టు కొట్టివేసింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరోకిన్ సోమవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించారు.



2లో..

# హెచ్-1బీ వీసాపై ట్రంప్ ప్రభుత్వానికి షాక్

## లక్ష డాలర్ల భారీ ఫీజు నిబంధన కొట్టివేత




**వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వానికి అక్కడి ఫెడరల్ న్యాయస్థానం గట్టి షాక్ ఇచ్చింది. విదేశీ ఐటీ నిపుణులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే హెచ్-1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల (సుమారు రూ.85 లక్షలకు పైగా) భారీ ఫీజు నిబంధనను కోర్టు కొట్టివేసింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం ఒక వివాదాస్పద నిబంధనను తీసుకువచ్చింది. దీని ప్రకారం.. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్-1బీ కి ఎంపికైన వారు లక్ష డాలర్ల భారీ మొత్తాన్ని ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ తుగ్లక్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపిన జడ్జి లియో సొరొకిన్.. ట్రంప్ ప్రభుత్వ నిబంధనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా పార్లమెంట్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నుల విధింపుపై ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకోలేరని కోర్టు స్పష్టం చేసింది.ప్రభుత్వం వసూలు చేయాలనుకున్న ఈ భారీ మొత్తం కేవలం ఒక పెనాల్టీ కాదని, ఇది స్పష్టంగా చట్ట విరుద్ధమైన పన్ను పరిధిలోకి వస్తుందని ప్రకటిస్తూ సదరు నిబంధనను పూర్తిగా రద్దు చేశారు. అమెరికా ఫెడరల్ కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు సాంకేతిక రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు పెద్ద ఊరట లభించింది. ముఖ్యంగా అమెరికా ఐటీ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయ టెక్కీలకు, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఈ తీర్పు అత్యంత సానుకూల అంశంగా మారింది. లక్షల రూపాయల అదనపు భారం తప్పడంతో భారతీయ ఐటీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పేదల ఆశలను నెరవేరుస్తున్న 'ప్రజా ప్రభుత్వం'
- అశ్వారావుపేటలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్..
- వంద పడకల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ మంజూరు
- నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు
- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన రెవెన్యూ మంత్రి



**అశ్వారావుపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు.

### నాడు పింక్ పార్టీ వారికే..

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే ప్రభుత్వ లబ్ది అందింది. కానీ నేడు కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయి" అని స్పష్టం చేశారు. పేదవాడి ఆత్మగౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వారావుపేట నియోజకవర్గానికే 4,000 ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్ల కాలనీల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

### రైతు రాజు లక్ష్యం..

రైతును రాజును చేయాలనే దృఢ సంకల్పంతో ఇప్పటికే రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామన్నారు. కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్యా, వైద్య రంగాల్లో అశ్వారావుపేటకు చేకూరుతున్న అభివృద్ధిని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. అశ్వారావుపేటలో రూ. 200 కోట్ల భారీ వ్యయంతో అత్యాధునిక 'ఇంటిగ్రేటెడ్ స్కూల్'ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ పేద, ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2,300 మంది విద్యార్థులు ఒకేచోట నాణ్యమైన విద్యనభ్యసిస్తారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ 'అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్'ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసిందని గుర్తుచేశారు.

### ఇది పేదవాడి ప్రభుత్వమే..

స్థానికంగా కొమురం భీమ్ అర్బన్ పార్క్ ప్రారంభం కావడం, పూసుకుంట కొండరెడ్ల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పేదవాడి ప్రభుత్వమని, భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నూటికి నూరు శాతం నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన బీఆర్ఎస్
- పదేళ్లలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన..
- తడిసిన ధాన్యానికీ మద్దతు ధర
- బీఆర్ఎస్, కేంద్ర ప్రభుత్వాలపై భట్టి నిప్పులు



**జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం దినమంతా శ్రమిస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కావాలనే ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలకులు ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే.. ఖజానాను అంతా ఖాళీ చేసి అప్పులకుప్పగా మార్చారని మండిపడ్డారు. మంగళవారం జనగామ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన ఆయన.. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీఆర్ఎస్, కేంద్ర ప్రభుత్వాల వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడా ఆపడం లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించామని ప్రకటించారు. ఇప్పటికే రైతులకు రూ. 22 వేల కోట్ల రుణమాఫీ చేశామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి, రూ. 14 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో వడ్ల కొనుగోళ్లు జరుగుతున్నాయని, తాము మొక్కజొన్నలను కూడా సేకరిస్తున్నామని భట్టి తెలిపారు. "రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని, మొక్కజొన్నలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదు? కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల కోసం రైతులు ఎదురుచూసేలా కేంద్రం చేస్తోంది" అని విమర్శించారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు నయాపైసా డబ్బులు చెల్లించకుండా ముంచేసింది. కానీ మా ప్రభుత్వం 30 లక్షల పంపుసెట్ల విద్యుత్తు బిల్లుల కింద రూ. 14 వేల కోట్లను డిస్కమ్‌లకు చెల్లిస్తోంది. అలాగే 53 లక్షల కుటుంబాలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహజ్యోతి) కోసం రూ. 5 వేల కోట్లు విడుదల చేశాం." అని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును గాలికొదిలేసిందని, తాము నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేశామని, త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని, కానీ నేడు కాంగ్రెస్ హయాంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో రఘునాథపల్లిలో 230 కేవీసబ్‌స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# కాంగోను వణికిస్తున్న ఎబోలా వైరస్

- వంద దాటిన మరణాల సంఖ్య
- 550కి పైగా కేసులు నమోదు
- 'బుందిబుగ్యో' రకం వైరస్‌గా గుర్తింపు..
- ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన




**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మధ్య ఆఫ్రికా దేశమైన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ మహమ్మారి తీవ్రస్థాయిలో విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వైరస్ కారణంగా కాంగోలో ఇప్పటివరకు 100 మందికి పైగా రోగులు మృత్యువాత పడటం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య శాఖ అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య అధికారుల నివేదికల ప్రకారం కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు ల్యాబొరేటరీ ద్వారా నిర్ధారణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా, కేవలం 19 మంది మాత్రమే ఇప్పటివరకు కోలుకున్నారు. తీవ్రమైన ఎబోలా లక్షణాలతో అనుమానితులుగా ఉన్న మరో 309 మందిని ప్రత్యేక వార్డుల్లో ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాంగోలోని ఇటురి, నార్త్ కివు ప్రాంతాలలో ఆదివారం ఒక్కరోజే 35 కొత్త కేసులు నమోదు కాగా, మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ వైరస్ వ్యాప్తి గరిష్ట స్థాయిలో ఉందని, వైద్యపరంగా వ్యాధిని సత్వరమే నిర్ధారించడం, దీనికి నిర్దిష్టమైన సరైన వ్యాక్సిన్ లేదా ప్రత్యేక చికిత్స లేకపోవడం అంతర్జాతీయ వైద్య బృందాలకు పెద్ద సవాల్‌గా మారింది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా అసలు కేసుల సంఖ్య అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కాంగోలో విజృంభిస్తున్న ఈ ఎబోలా 'బుందిబుగ్యో' రకానికి చెందినదని, దీని వ్యాప్తి రేటు ఎక్కువగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఈ వైరస్ ప్రాంతీయంగా పొరుగు దేశాలకు మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటూ అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. అప్పుడే కాంగో సరిహద్దులు దాటి ఉగాండా దేశంలోనూ 19 ఎబోలా కేసులు నిర్ధారణ కాగా, అక్కడ కూడా ఇద్దరు మృతి చెందినట్లు డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది. ఆఫ్రికా వ్యాప్తంగా ఈ మహమ్మారిని అరికట్టేందుకు అత్యవసర నిధులు, నిపుణుల బృందాలను రంగంలోకి దింపుతున్నారు.

# గ్రామకంఠం ప్రభుత్వ భూమిని రక్షించండి

- తహశీల్దార్‌కు గ్రామస్థుల వినతి
- సబ్‌స్టేషన్ స్థలాన్ని అక్రమంగా దున్నిన స్థానిక సర్పంచ్
- విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- కంసానిపల్లీ ప్రజల ఆగ్రహం



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండలంలోని కంసానిపల్లీ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం కేటాయించిన గ్రామకంఠం ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుండి కాపాడాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం మండల తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 147 లో గల 1.10 ఎకరాల స్థలాన్ని సబ్‌స్టేషన్ కొరకు కేటాయించగా, కొందరు అక్రమంగా దానిని దున్నడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కంసానిపల్లీ గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎంతో అవసరమని, దీని కోసం కేటాయించిన స్థలంలోకి గ్రామానికి చెందిన ప్రస్తుత సర్పంచ్ లలిత వెంకటేశ్వర్లు, చీమర్ల తిరుపతయ్య, చీమర్ల శ్రీనివాసులు, చీమర్ల యాదయ్యలు అక్రమంగా చొరబడి ట్రాక్టర్లతో దున్నడం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు. ప్రజలందరికీ ఉపయోగపడే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని కొంతమంది తమ స్వార్థం కోసం అడ్డుకోవడం తగదని వారు మండిపడ్డారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు మా హక్కు > "గ్రామంలో లో–వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ఎంతో కీలకం. ఇప్పటికైనా రెవెన్యూ తహశీల్దార్ గారు, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి. సబ్‌స్టేషన్ కొరకు కేటాయించిన స్థలాన్ని కాపాడి, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా సహకరించాలి." అని కంసానిపల్లీ గ్రామ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్టా శేఖర్ రెడ్డి, కంసానిపల్లీ తండా సర్పంచ్ కాట్రావత్ వాల్య నాయక్, మాజీ ఎంపీటీసీ కొట్టే శ్రీనివాసులు, మాజీ ఉపసర్పంచ్ చింతల నాగరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్తూరి రామకృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ యువ నాయకులు మర్యాద లక్ష్మీనరసింహారెడ్డి, భయ్యా నరేష్, మాచర్ల చంద్రు, దొడ్డు ఎల్లయ్య, కాట్రవత్ లచ్చు, గజ్జ శైలు, బొల్లు మల్లయ్య, మూడవత్ రెడ్యా నాయక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బైపాస్ నిర్మాణంలో జాప్యమెందుకు..?



**గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నియోజకవర్గ కేంద్రమైన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని గండ్ర యువసేన జిల్లా అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మాణ జాప్యంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలనే దూరదృష్టితో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తుచేశారు. భూపాలపల్లి పరిధిలోని బాంబులగడ్డ నుంచి గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి వరకు ఈ బైపాస్ రోడ్డును మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఆర్థిక, రెవెన్యూ శాఖల నుండి అన్ని రకాల అనుమతులు లభించినప్పటికీ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటుతున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. "జిల్లా కేంద్రంలో భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఎంతోమంది అమాయకులు రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజల అత్యవసర అవసరాలను, ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలను పక్కనబెట్టి వెంటనే బైపాస్ రోడ్డు పనులను ప్రారంభించాలి." అని పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించకపోతే.. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున క్షేత్రస్థాయి పోరాటాలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

# అంతర్జాతీయ సదస్సులో వెంకట్రామరెడ్డి విశిష్ట ప్రతిభ




**కేయూ క్యాంపస్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గోవాలోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జూన్ 8, 9 తేదీలలో నిర్వహించిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ మల్టీఫంక్షనల్ మెటీరియల్స్ అండ్ డివైసెస్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్– 2026" అంతర్జాతీయ సదస్సులో కాకతీయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ బి. వెంకట్రామరెడ్డి విశిష్ట ప్రతిభ కనబరిచారు. సుస్థిర సాంకేతికతలకు అవసరమైన బహుళ విధుల పదార్థాలు, పరికరాలపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలను ఒకే వేదికపై చర్చించేందుకు ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ బి. వెంకట్రామరెడ్డి "స్పెక్ట్రాస్కోపిక్ అండ్ క్వాంటుం కెమికల్ స్టడీస్ – ఆన్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్" అనే అంశంపై ప్రత్యేక ఆహ్వానిత ఉపన్యాసం ఇచ్చారు. భౌతిక శాస్త్రంలో సరికొత్త పరిశోధనా విధానాలను వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగం దేశ విదేశాల నుంచి హాజరైన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకుల నుండి విశేష ప్రశంసలను అందుకుంది. సదస్సులో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఒక 'ప్లీనరీ సెషన్'కు ప్రొఫెసర్ వెంకట్రామరెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ వర్సిటీల పరిశోధకులు సమర్పించిన పోస్టర్ ప్రజెంటేషన్లను మూల్యాంకనం చేసి, ఉత్తమ పోస్టర్లను ఎంపిక చేసే 'నిపుణుల కమిటీ' సభ్యునిగా ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు. కేయూ పూర్వ విద్యార్థి సారథ్యం: విశేషమేమిటంటే, ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆచార్య సైది రెడ్డి కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ఈయన ప్రస్తుతం ఎన్ఐటీ గోవాలో డీన్‌గా సేవలందిస్తున్నారు. ఆచార్య వెంకట్రామరెడ్డి తన పరిశోధనా బృందానికి చెందిన ముగ్గురు పరిశోధక విద్యార్థులతో కలిసి ఈ సదస్సులో పాల్గొని తమ పరిశోధన ఫలితాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి హాజరైన శాస్త్రవేత్తలతో శాస్త్రీయ అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపి, భవిష్యత్ పరిశోధనా సహకార అవకాశాలను అన్వేషించారు. అంతర్జాతీయ స్థాయిలో కాకతీయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని మరింత పెంపొందించిన ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ప్రత్యేకంగా అభినందించారు. వర్సిటీకి చెందిన పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# మీసాల ప్రకాష్‌కు మంత్రి కొండా సురేఖ జన్మదిన శుభాకాంక్షలు



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మీసాల ప్రకాష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాస గృహంలో మీసాల ప్రకాష్ ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ.. మీసాల ప్రకాష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పూలబొకే అందించి, స్వీట్లు తినిపించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య



**గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య అందుతుందని మహా ముత్తారం మండలము స్తంభం పల్లి గ్రామ సర్పంచ్ జంగిడి కీర్తన శ్రీనివాస్ అన్నారు .ములుగు పల్లి ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం లో భాగంగా స్తంభం పల్లిలో బడి బాట కరపత్రాలు గ్రామంలోని తల్లి దండ్రులకు అందచేసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కీర్తన శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనూ ఉండాలన్నారు. బయాలజీ టీచర్ కామిడి సతీశ రెడ్డి మాట్లాడుతూ ములుగు పల్లి లో టెన్త్ ఫలితాలలో అందరు ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో టాపర్ గా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోడేటి వెంకటేష్ స్తంభం పల్లి యూత్ నాయకులు పసుల రామ్, జాడి అజయ్, చరణ్, పసుల రాజ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, సూడిది ప్రవీణ్, పసుల రమేష్, రామ్ చరణ్, శివ కుమార్ పాల్గొన్నారు.

# పీహెచ్‌డీ పట్టా అందుకున్న భానోత్ దేవిక




**డోర్నకల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని నిరూపించింది మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఒక గిరిజన మహిళ. డోర్నకల్ మండలం చాప్లతండాకు చెందిన భానోత్ దేవిక ప్రతిష్టాత్మకమైన పీహెచ్‌డీ పట్టా అందుకుని తన ప్రాంతానికి ఖ్యాతి తీసుకువచ్చారు. హన్మకొండలోని ఎస్ఆర్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆమెకు ఈ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేశారు. భానోత్ దేవిక మెకానికల్/బయో–మెడికల్ ఇంజనీరింగ్ విభాగంలో భాగంగా "డిజైన్ ఫ్యాబ్రికేషన్, బయోమెకానికల్ ఎవల్యూషన్ ఆఫ్ లాటిస్ స్ట్రక్చర్ బోన్ ఇంప్లాంట్స్" అనే అత్యంత సంక్లిష్టమైన, ఆధునిక అంశంపై పరిశోధన (రీసెర్చ్) చేశారు. మానవ ఎముకల అమరిక, వాటి చికిత్సకు సంబంధించిన ఈ పరిశోధనను ఆమె ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ పంకజ్ కుమార్, డాక్టర్ రాజా శ్రీరెడ్డిల మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేశారు. ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ సమక్షంలో జరిగిన ఈ కాన్వొకేషన్ వేడుకకు దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, కళాకారులు ప్రొఫెసర్ వి. రామగోపాల్ రావు: (శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, బిట్స్ పిలానీ డైరెక్టర్), డాక్టర్ దీపికా రెడ్డి: (పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి), ఎ.వరదారెడ్డి: (ఎస్ఆర్ యూనివర్సిటీ ఛైర్మన్) లు హాజరయ్యారు.

# ఎన్నికల సామగ్రి భద్రతలో లోపాలు ఉండొద్దు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్
- నిబంధనలు కచ్చితంగా పాటించాలి



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నిబంధనల ప్రకారం ఎన్నికల సామగ్రి భద్రతను పక్కాగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. త్రైమాసిక అంతర్గత తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం ఆమె ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని ఈవీఎం గోదామును సందర్శించారు. వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తాళాలు తీయించి భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల అమరిక, స్ట్రాంగ్ రూమ్ రికార్డుల నిర్వహణ, అంతరత భద్రతను తనిఖీ చేశారు. గోదాం పరిసరాల్లో అమర్చిన సీసీటీవీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను, ప్రవేశ నియంత్రణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. "ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదు. గోదాం రికార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా అప్‌డేట్ చేయాలి. భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి చిన్న లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి." అని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఎన్నికల విభాగం డీటీ రంజిత్, సంబంధిత రెవెన్యూ, ఎన్నికల అధికారులు, సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణ 'మార్నింగ్ వాక్'

- జనంలో జనంలా పర్యటన
- సమస్యల పరిష్కారమే ధ్యేయం..
- అధికారులకు అక్కడికక్కడే ఫోన్ ద్వారా ఆదేశాలు



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం ఉదయం లింగాల పట్టణ కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. సామాన్యుడిలా పట్టణ వీధుల్లో 'మార్నింగ్ వాక్' చేస్తూ ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే కోణంలో పట్టణాన్ని మొత్తం కలియతిరిగారు. పర్యటనలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులు, స్థానికులతో ఎమ్మెల్యే ముఖాముఖి మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదులపై ఆయన అక్కడికక్కడే స్పందించి సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. లింగాల ప్రజల చిరకాల కోరిక అయిన పాత బస్టాండ్‌ను నూతనంగా పునఃప్రారంభించే అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ బస్సులు విధిగా బస్టాండ్ లోపలికి వచ్చి వెళ్లేలా చూడాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై త్వరలోనే ఫలితాలు కనిపిస్తాయని ఆయన హామీ ఇచ్చారు. పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను వారి నివాసాల్లో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. వారికి ధైర్యం చెబుతూ.. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. "మన ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడైన పేదవాడికి అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ప్రజాసేవలో మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం." అని డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య, మండల పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా ఎదుగుతుంటే బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది

**మంత్రి సీతక్క**

**ఫ్రీ బస్సు స్కీమ్ తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు**



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కోరుకుంటే.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఏడుస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలు ప్రగతి పథంలో పయనిస్తుంటే బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మహిళా శక్తి సభ'కు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా కోట్లాది మంది ఆడబిడ్డలకు ఆర్థికంగా ఎంతో ఆసరా లభించిందన్నారు. అయితే, ఈ పథకం సాధిస్తున్న విజయాన్ని చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని, వారిపై ఈ సందర్భంగా మంత్రి ఫైర్ అయ్యారు. మహిళలను కేవలం వంటింటికే పరిమితం చేయకుండా, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి సభలో వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయక సంఘాల (SHG) మహిళల కోసం రికార్డు స్థాయిలో రూ. 61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని వెల్లడించారు. వీటికి సంబంధించిన రూ. 2 వేల కోట్ల వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే బ్యాంకులకి చెల్లిస్తూ మహిళలపై భారం పడకుండా చూస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ (IKP) కొనుగోలు కేంద్రాల బాధ్యతలను అప్పగించామని చెప్పారు. వీటి నిర్వహణ ద్వారా మన ఆడబిడ్డలకు గత ఏడాది కాలంలోనే రూ. 159 కోట్ల నికర ఆదాయం సమకూరిందని సగర్వంగా ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు చదువుకోని 12 లక్షల మంది మహిళలకు ప్రత్యేకంగా చదువు చెప్పిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, మరింత మందికి లబ్ధి చేకూర్చేందుకు 60 ఏళ్లు దాటిన వృద్ధ మహిళలను సైతం మహిళా సంఘాలలో చేర్చుకుంటున్నట్లు మంత్రి వివరించారు. "తెలంగాణలోని గ్రామీణ ప్రాంత మహిళలు స్వయంగా తయారు చేసే అద్భుతమైన ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానిస్తూ ప్రపంచానికి వారి ప్రతిభను చూపిస్తున్నాం. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే ఏ ఒక్క అవకాశాన్ని మా ప్రభుత్వం వదులుకోదు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ భారీ మహిళా శక్తి సభలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన లక్షలాది మంది పొదుపు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- సీపీఎం నాయకుడు సైదులు డిమాండ్
- అచ్చంపేటలో 14 ఏళ్లుగా జర్నలిస్టుల నిరీక్షణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ప్రతి జర్నలిస్టుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇండ్ల స్థలాలను కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ – మార్క్సిస్టు (సీపీఎం) అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధం సైదులు డిమాండ్ చేశారు. అచ్చంపేటలో విలేకరుల సమస్యలపై ఆయన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్ధం సైదులు మాట్లాడుతూ.. సమాజంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన జర్నలిస్టుల పాత్రను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య నిరంతరం వారధిగా ఉంటూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంలా జర్నలిస్టులు తమ విధులను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఎలాంటి ప్రభుత్వ గౌరవ వేతనాలు లేకపోయినప్పటికీ, కేవలం సామాజిక బాధ్యతతో పేద ప్రజల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో విలేకరులు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. గత పాలకుల నిర్లక్ష్యంపై సైదులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని కేవలం మాటలకే పరిమితమై చేతులు దులుపుకుందని విమర్శించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు గత 14 సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల కోసం కండ్లల్లో వత్తులు వేసుకుని వేచి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాము ఎన్నికల నివేదికలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలి. అచ్చంపేట నియోజకవర్గంలో ఇండ్ల స్థలాలు లేని జర్నలిస్టులను గుర్తించి, వారికి త్వరగతిన స్థలాలు కేటాయించి ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. లేనిపక్షంలో జర్నలిస్టుల న్యాయమైన పోరాటాలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది." అని వర్ధంసైదులు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.